క్లుప్తంగా

కనుల పండువగా దీపోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ రామకృష్ణాపురం గ్రంథాలయం సమీపంలో సోమవారం సాయంత్రం కార్తిక మాసోత్సవాల్లో భాగంగా దీపోత్సవం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో విశేషమైన కార్తిక పౌర్ణమి రోజున ప్రజలందరూ కలిసిమెలసి దీపోత్సవం జరుపుకోవడం అభినందనీయం అన్నారు. స్వామివారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ హెచ్ఎస్వీ జానారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సునీత, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



విజయవాడ కల్చరల్: కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సామాజిక సేవాసంస్థ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం, బందరు రోడ్డులోని స్వరాజ్య మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం పూర్తి చేసుకొన్న సందర్భంగా గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద అంబేడ్కర్ స్ఫూర్తిసభ, స్వరనీరాజనం కార్యక్రమం నిర్వహించారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తి వంతమైన జీవితం గడిపారని ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సంస్థ అధ్యక్షుడు మాలపాటి వెంకటపతి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంబేడ్కర్‌కు స్వరనీరాజనంలో భాగంగా పావని, రూపశ్రీ, రేష్మ, జయప్రభ క్లాసికల్ గీతాలను ఆలపించారు. గాయనీ గాయకులను నిర్వాహకులు సత్కరించారు. వివిధ సంస్థల ప్రతినిధులు పరచూరి విజయలక్ష్మి, ప్రసూన రామన్, బలరామకృష్ణమూర్తి, ఉమాబలరాం, చింతకాయల చిట్టిబాబు పాల్గొన్నారు.

ముగిసిన సైన్స్ ఎక్స్‌పో



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏలూరు రోడ్డులోని సీతారామపురం ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో మూడు రోజుల పాటు జరిగిన సైన్స్ ఎక్స్‌పో సోమవారంతో ముగిసింది. ఎక్స్‌పోలో విద్యార్థులు 472 ప్రాజెక్టులను ప్రదర్శించారు. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, సోషల్, ఎన్విరాన్‌మెంట్ సైన్స్, స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్, ఆస్ట్రానమీ, డిఫెన్స్ టెక్నాలజీ వంటి వివిధ అంశాలతో కూడిన ఎగ్జిబిట్‌లను ప్రదర్శించారు. ఎక్స్‌పోను మూడు వేల మందిపైగా సందర్శించారని నిర్వాహకులు తెలిపారు. ముగింపు సభలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ దివాస్ అధ్యక్షురాలు స్వరూప మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఎక్స్‌పో దోహదం చేస్తుందని చెప్పారు. అనంతరం ఐదు విభాగాల్లో 216 మంది విద్యార్థులకి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వై.పార్థసారథి, డైరెక్టర్ ఎం.లక్ష్మీప్రసాద్, చైర్మన్ కె.రాజేంద్రప్రసాద్, పీపీ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకాపునాడు 23వ డివిజన్ అధ్యక్షుడిగా వెంకటరమణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట 23వ డివిజన్ ప్రజాకాపునాడు అధ్యక్షుడుగా దాసరి వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా కాకాని కోటేశ్వరరావు నియమితులయ్యారు. డివిజన్‌లోని కాపునాడు కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు సోమవారం వారికి నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ కాపుల ఐక్యత కోసం పని చేయాలన్నారు. కార్యక్రమంలో రాడ భాస్కరరావు, బావిరెడ్డి ఆంజనేయులు పాల్గొన్నారు.

జగనన్న పాలనపై హర్షాతిరేకాలు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజావసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారం చూపుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ 240వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన నందమూరినగర్‌లో 121 గడపలను సందర్శించారు. స్థానికుల నుంచి అర్జీలు స్వీకరించి వాటిలో పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. అధికారం చేపట్టిన నాలుగున్నరేళ్ల కాలంలో నిత్యం ప్రజల మధ్యనే ఉన్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం మాత్రమేనని, గత టీడీపీ ఐదేళ్ల అసమర్థ పాలన కారణంగా తమపై మరింత పని భారం పెరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రజావసరాలను తీర్చడంలో తమ ప్రభుత్వం ఎక్కడా వెనకడుగు వేయలేదని చెప్పారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు నుంచి న్యూఆర్ఆర్ పేట మధ్య కాలనీలన్నింటినీ 90శాతం వరకు అభివృద్ధి చేశామని తెలిపారు. మిగిలిన పనులన్నింటినీ డిసెంబర్ చివరికల్లా పూర్తి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని వివరించారు.

టీడీపీ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి: డా.బిఆర్.అంబేడ్కర్ స్ఫూర్తితో పాలన సాగిస్తూ రాష్ట్రంలో సీఎం జగన్ సుస్థిర ప్రభుత్వాన్ని నెలకొల్పారని మల్లాది విష్ణు అన్నారు. అటువంటి సీఎం గురించి మాట్లాడే ముందు టీడీపీ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని సూచించారు. ముఖ్యంగా టీడీపీ హయాంలో నిండా అవినీతిలో కూరుకున్న అచ్చెన్నాయుడు సహా అప్పటి మంత్రులకు సీఎం జగన్ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని చెప్పారు. 2019 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలందరూ కర్ర కాల్చి వాత పెట్టినా టీడీపీ నాయకులకు బుద్ధి రాలేదని విమర్శించారు. మరోవైపు యువగళం ఒక ఫెయిల్యూర్ ప్రోగ్రాం అని, ప్రభుత్వం, సీఎంపై బురద జల్లేందుకు చేపట్టిన యాత్ర తప్ప ప్రజావసరాలను గుర్తించే కార్యక్రమం ఏమాత్రం కాదని ఎద్దేవా చేశారు. ఎవరెన్ని కుప్పిగంతులు వేసినా సీఎం జగన్ సిద్ధాంతాలు, ఆశయాల ముందు నిలబడలేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, మానం వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, అంజిరెడ్డి, తోపుల వరలక్ష్మి, శోభన్, మహేశ్వరి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక పూజలు



ముత్యాలంపాడులో స్వామివారు



మధురానగర్‌లో శ్రీబాలసుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో..

మధురానగర్(విజయవాడ సెంట్రల్): శివకేశవులకు ప్రీతికరమైన కార్తిక సోమవారం కావడంతో నగరంలోని పలు శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. మహిళలు పెద్దసంఖ్యలో శివాలయాలకు చేరుకుని దీపాలను వెలిగించారు. కార్తికమాసంలో 365 వత్తులతో దీపాలను వెలిగిస్తే సంవత్సరమంతా దీపారాధన చేసిన ఫలం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

ముత్యాలంపాడులో....

స్థానిక ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాయలంలో సోమవారం ఉదయం 4గంటలకి గోపూజతో కార్తిక పూజలు ప్రారంభమయ్యాయి. మహన్యాసపూర్వక ఏకరుద్రాభిషేకం, నవగ్రహాభిషేకం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారికి పూజలు అభిషేకాలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకట నరసింహరాజు, కార్యదర్శి శివరామరాజు, ఐఎస్ఎన్ రాజు, మండలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.

అయోధ్యనగర్‌లో.....

శ్రీదత్తసాయి శివకామేశ్వరి పీఠంలో శ్రీధర్మ పరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన కార్తిక సోమవారం పూజలు, అభిషేకాలు ఘనంగా జరిగాయి. వేదపండితుల మంత్రోచ్చారణలతో సహస్రలింగార్చన, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో.....

మధురానగర్ స్వయంభూ శ్రీ బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవాలయంలో కార్తిక సోమవారం దీపోత్సవం జరిగింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని దీపాలను వెలిగించి పూజలు చేశారు.

స్ఫూర్తి ట్రస్ట్‌లో....

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ కార్యాలయంలో కార్తిక దీపోత్సవం ఘనంగా జరిగింది. స్ఫూర్తి ట్రస్ట్ సభ్యులందరూ ఆనందోత్సాహాలతో కార్తిక దీపోత్సవంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మాతృదేవోభవ, అమ్మ వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు దుప్పట్లు, ఫలహారాలు పంపిణీచేసి కార్తికపౌర్ణమి విశిష్టతనువివరించారు.

శ్రీదత్తసాయి మందిరంలో...

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో కార్తిక సోమవారం దీపోత్సవం ఘనంగా జరిగింది. అయ్యప్పలు, భవానీలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 800 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది.

అయ్యప్ప దేవాలయంలో కార్తిక పౌర్ణమి

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్పస్వామి మందిరంలో కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు సోమవారం జరిగాయి. శ్రీమణికంఠ ధారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బల్లెం పూర్ణయ్య గురుస్వామి స్వామివారికి అభిషేకాలు పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు రెండు వేలమందికి అన్నదానం చేశారు. భక్తులు, స్వాములు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తుల కోలాహలం మధ్య గిరిప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో ఉత్సవమూర్తులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక పౌర్ణమి, సోమవారం దుర్గమ్మ భక్తుల కోలాహలం మధ్య సోమవారం ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ జరిగింది. కొండపై ఘాట్ రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణలో ఆది దంపతుల ఉత్సవమూర్తులతో పాటు దేవస్థాన పాలక మండలి సభ్యులు, ఆలయ అధికారులు, భక్తులు, సేవా సిబ్బంది పాల్గొన్నారు. శ్రీ గంగా పార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు పూజా కార్యక్రమాలు, కొబ్బరికాయ కొట్టి గిరిప్రదక్షిణ ప్రారంభించారు. ఆలయ ఈఈలు కేవీఎస్ కోటేశ్వరరావు, లింగం రమాదేవి, ఏఈవో చంద్రశేఖర్ గిరి ప్రదక్షిణను పర్యవేక్షించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తజనుల కోలాట నృత్యాల మధ్య ఊరేగింపు ముందుకు సాగింది. ఘాట్‌రోడ్డు నుంచి కుమ్మరిపాలెం, విద్యాధరపురం, నాలుగుస్తంభాలు, సితార సెంటర్, కబేళా, పాలప్రాజెక్టు ఫ్లైఓవర్, కేఎల్‌రావునగర్, చిట్టినగర్, కొత్తపేట కేటీరోడ్డు, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదగా తిరిగి అమ్మవారి ఆలయానికి చేరుకుంది. గిరి ప్రదక్షిణలో పాల్గొంటే కోరికలు త్వరగా తీరుతాయని భక్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు. పాలక మండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో 74వ రాజ్యంగ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. డీఆర్ఎం కార్యాలయంలో జరిగిన వేడుకల్లో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన రాజ్యాంగ ప్రవేశికను చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1949 నవంబర్, 26న భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన సందర్భంగా ఏటా సంవిధాన్ దివస్ పేరుతో రాజ్యాంగ దినోత్సవాన్ని డివిజన్ వ్యాప్తంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. డివిజన్‌లోని ప్రధాన రైల్వేస్టేషన్లు, వర్కుషాపులు, డిపోల్లో కూడా రాజ్యాంగ దినోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. రైల్వే స్టేషన్‌లు, రైళ్లలో బ్యానర్లు, పోస్టర్లను ప్రదర్శించామన్నారు. అనంతరం ఆయన ఉద్యోగులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీకాంత్, పలు బ్రాంచ్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

- మేయర్ భాగ్యలక్ష్మి
- వీఎంసీ స్పందనలో 18 ఫిర్యాదులు

పటమట(విజయవాడతూర్పు): నగరవాసుల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం స్పందన నిర్వహించారు. ఆమె నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 18 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగంపై-7, ఇంజినీరింగ్ విభాగంపై-5, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ)పై-3, ఎస్టేట్ విభాగంపై-1, హెల్త్ విభాగంపై-1, ఎడ్యుకేషన్ విభాగంపై -1 ఫిర్యాదులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందనలో వచ్చిన సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలన్నారు. పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) కె.వి. సత్యవతి, అడిషనల్ కమిషనర్ (జనరల్) కె.శకుంతల, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రత్నావళి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) రోహిణి, సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఎస్ఈ (వర్క్స్)నరసింహ మూర్తి, అకౌంట్స్ అధికారి నరసింహమూర్తి, ఆర్ఎఫ్‌వో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం

- మానసికోల్లాసంపై దృష్టి పెడుతున్న నగర ప్రజలు
- అందుకనుగుణంగా తీర్చిదిద్దుతున్న పార్కులు
- ఒత్తిళ్లకు దూరంగా ఉండొచ్చు
- జీవన శైలి వ్యాధులను అధిగమించేందుకు వ్యాయామంపై దృష్టి
- పార్కుల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు



న్యూ ఆర్టీసీ కాలనీలోని నగరపాలక సంస్థ పార్కులో సందడి చేస్తున్న చిన్నారులు



పటమట రెవెన్యూ కాలనీలోని వీఎంసీ పార్కులో జిమ్ చేస్తున్న దృశ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉరుకులు పరుగుల జీవన విధానంలో సిటీ లైఫ్ గజిబిజి గందరగోళంగా మారింది. విధి నిర్వహణలో, నగరంలోని ట్రాఫిక్‌లో ప్రయాణం ఇలా ప్రతి ఒక్కరూ తీవ్రమైన ఒత్తిళ్లకు గురవుతున్నారు. అలాంటి జీవనం నుంచి బయట పడేందుకు ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు వీకెండ్స్‌లో దూర ప్రాంతాల్లోని ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చని ప్రదేశాల్లో గడిపేవారు. ఇప్పుడు అలాంటి అవసరం లేకుండా, నగరంలోనే నందనవనాల్లా ప్రభుత్వం పార్కులను తీర్చిదిద్దింది. ఆయా పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్‌జిమ్, పిల్లల కోసం ఆటపరికరాలు ఏర్పాటు చేశారు. ఒకప్పుడు పార్కుకు వెళ్లాలంటే నగరంలో రాజీవ్ గాంధీ పార్కు, అంబేడ్కర్ పార్కు వంటి వాటికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి అవసరం లేకుండా కాలనీల్లోనే అన్ని సౌకర్యాలతో పార్కులను అభివృద్ధి చేశారు.

అందుబాటులోనే పచ్చదనం....

ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు ఇంటి సమీపంలోనే పార్కులు అందుబాటులోకి వచ్చాయి. వాటిలో రకరకాల మొక్కలను పెంచుతున్నారు. ఉద్యానవనశాఖ ద్వారా నగర పాలక సంస్థ అరుదైన మొక్కలను అక్కడ ఏర్పాటు చేసింది. పార్కును సందర్శించిన వారికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా వాటిని తీర్చిదిద్దుతున్నారు. వాటిని సందర్శించి మానసికోల్లాసం పొందేలా రూపొందించారు. నగరంలోని ప్రధాన పార్కులైన రాజీవ్‌గాంధీ పార్కు, అంబేడ్కర్ పార్కు వంటి వాటిని రూ. కోట్లు వెచ్చించి అభివృద్ధి చేయడంతో పాటు, కాలనీల్లోనూ పార్కులు ఏర్పాటు చేశారు.

ఇంటి సమీపంలోనే...

వాకింగ్ చేయాలంటే ఒకప్పుడు దూర ప్రాంతంలోని గ్రౌండ్‌కు వెళ్లాల్సి రావడంతో మహిళలు వాకింగ్‌పై ఆసక్తి చూపేవారు కాదు. ఇప్పుడు తాము నివశిస్తున్న కాలనీల్లోనే పార్కులు ఏర్పాటు చేయడం, వాటిలో వాకింగ్ ట్రాక్‌లు ఉండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుల్లో వాకింగ్ చేసేందుకు మహిళలే ఎక్కువగా వస్తున్నారు. పిల్లలకు ఆట పరికరాలను ఏర్పాటు చేయడంతో కొందరు మహిళల తమ పిల్లలను తీసుకుని పార్కుకు వచ్చి, వాళ్లు ఆడుకుంటుంటే, తల్లులు వాకింగ్ చేస్తున్నారు.

కుటుంబ సమేతంగా....

నగర జీవికి శారీరక శ్రమ లేకపోవడంతో ఎక్కువగా జీవనశైలి వ్యాధులకు గురవుతున్నారు. వాటి నుంచి బయట పడేందుకు వ్యాయామంపై దృష్టి సారిస్తున్నారు. ఒకప్పుడు వ్యాయామం చేయాలంటే జిమ్‌కు వెళ్లాల్సి వచ్చేది. లేదంటే దూరం ప్రాంతంలో వాకింగ్ ట్రాక్ ఉన్న గ్రౌండ్‌కు వెళ్లేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇంటి సమీపంలో తమ కాలనీల్లోనే పార్కులు అందుబాటులోకి వచ్చాయి. వాటిలో వాకింగ్ ట్రాక్‌లతో పాటు, ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో భార్యాభర్తలతో పాటు, తమ పిల్లలను తీసుకుని పార్కులకు వచ్చి వ్యాయామం చేస్తున్న వారు ఎక్కువగా ఉంటున్నారు. మరోవైపు వృద్ధులు సైతం మానసికోల్లాసం కోసం పార్కులకు వస్తున్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వం పార్కులను అభివృద్ధి చేసింది.


వ్యాయామంపై దృష్టి



శ్రమలేని జీవన విధానంతో ఎక్కువ మంది జీవనశైలి వ్యాధులైన మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. ఇంటి సమీపంలోనే వాకింగ్ ట్రాక్‌లు, పార్కులు అందుబాటులోకి రావడంతో ద్వారా వాకింగ్‌పై దృష్టి సారించే అవకాశం ఉంది. ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేయడంతో వాకింగ్‌తో పాటు, కొద్దిసేపు వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా జీవించవచ్చు. ప్రస్తుతం మహిళలు సైతం ఆ దిశగా ప్రయత్నిస్తున్నారు.

– డాక్టర్ దుర్గాప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జీజీహెచ్

మానసికంగా చాలా ఉపయోగం



బిజీలైఫ్ నుంచి బయటపడేందుకు వాకింగ్ చాలా అవసరం. పచ్చని మొక్కలు చూస్తూ వాకింగ్ చేయడం వలన మానసిక ఉల్లాసంతో పాటు, మెమొరీ పెరుగుతుంది. ఉదయం సాయంత్రం వేళ్లలో పచ్చని మొక్కల మధ్య వాకింగ్‌తో స్వచ్ఛమైన ఆక్సిజన్ బ్రెయిన్‌కు అందుతుంది. వృద్ధుల్లో జ్ఞాపకశక్తి తగ్గకుండా దోహదపడుతుంది. ఉదయం వేళ వాకింగ్‌తో విటమిన్ డి లభిస్తుంది. దీంతో ఎముకల పటుత్వంతో పాటు, హ్యాపీ హార్మోన్ రిలేజ్ అవుతుంది. తద్వారా మానసిక ఒత్తిళ్లు తగ్గుతాయి.

–డాక్టర్ గర్రే శంకరరావు, మానసిక విశ్లేషకులు

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరిపేటలోని సీతారామకాలనీలో రూ. 23.21 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజా, స్థానిక కార్పొరేటర్ ఇసరపు దేవీతో కలిసి సోమవారం ఆయన భూమిపూజ నిర్వహించారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లలో డివిజన్లో రూ.7 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పోలీస్ స్టేషన్ ఎదురు 9 రోడ్లకు యూజీడీ, వాటర్‌లైన్ పనులు ఇప్పటికే పూర్తి చేసుకోగా కోటి రూపాయలతో రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు చెప్పారు. కేర్ అండ్ షేర్ స్కూల్లో రూ. 2 కోట్ల నాడు–నేడు నిధులతో చేపట్టిన 14 అదనపు తరగతి గదులు నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నట్లు వెల్లడించారు. ప్రతి గడపకు అభివృద్ధి అనే నినాదంతో ముందుకు సాగుతున్న జగనన్న ప్రభుత్వానికి ప్రతిఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఇందిరానాయక్‌నగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వాములు సూరిస్వామి, లంకలపల్లి శ్రీనుల ఆధ్వర్యంలో 40 మంది స్వాములకి ఇరుముడులు కట్టారు. అనంతరం స్వాములందరూ శబరిగిరికి పయనమయ్యారు. మోహనరావు, ఢిల్లీ భూపతి, మదన్, కుటుంబరావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న ట్రాక్ మెయింటినెన్స్ పనుల కారణంగా డివిజన్‌లో పలు రైళ్లు పూర్తి, మరికొన్ని పాక్షికంగా రద్దు చేయడంతో పాటు ఇంకొన్నింటిని దారి మళ్లించి నడపనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ నెల 27 నుంచి డిసెంబర్ మూడో తేదీ వరకు కాకినాడ పోర్టు - విశాఖపట్నం (17267/17268), మచిలీపట్నం - విశాఖపట్నం (17219/17220), గుంటూరు - రాయగడ (17243/17244), గుంటూరు - విశాఖపట్నం (17239), బిట్రగుంట - విజయవాడ (07977), బిట్రగుంట - చెన్నై సెంట్రల్ (17237), విజయవాడ - తెనాలి (07279/07575), విజయవాడ - ఒంగోలు (07461/07576), విజయవాడ - గూడూరు (07500), ఈ నెల 28 నుంచి డిసెంబర్ నాలుగో తేదీ వరకు విశాఖపట్నం - గుంటూరు (17240), గూడూరు - విజయవాడ (07458), ఈ నెల 27, 28, 29, డిసెంబర్ రెండు తేదీల్లో విజయవాడ - విశాఖపట్నం (22702), ఈ నెల 27 నుంచి డిసెంబర్ మూడు వరకు విశాఖపట్నం - విజయవాడ (22701) రైళ్లను పూర్తిగా రద్దు చేశారు.

పాక్షికంగా రద్దు చేసిన రైళ్లు ఇవీ

ఈ నెల 27 నుంచి డిసెంబర్ మూడో తేదీ వరకు మచిలీపట్నం - విజయవాడ (07896), విజయవాడ - మచిలీపట్నం (07769), నర్సాపూర్ - విజయవాడ (07863), మచిలీపట్నం - విజయవాడ (07866), మచిలీపట్నం - విజయవాడ (07770), విజయవాడ - భీమవరం జంక్షన్ (07283), మచిలీపట్నం - విజయవాడ (07870), విజయవాడ - నర్సాపూర్ (07861) రైళ్లు రామవరప్పాడు-విజయవాడ మధ్య పాక్షికంగా రద్దు చేశారు.

దారి మళ్లించిన రైళ్లు ఇవీ..

డిసెంబర్ రెండో తేదీన భావ్‌నగర్ - కాకినాడ పోర్టు (22643), ఈ నెల 29, డిసెంబర్ ఒకటో తేదీన బెంగళూరు - గౌహతి (12509), ఈ నెల 29, డిసెంబర్ ఒకటి, రెండు తేదీల్లో ఛత్రపతి శివాజీ టెర్మినల్ - భువనేశ్వర్ (11019), ఈ నెల 29 నుంచి డిసెంబర్ మూడో తేదీ వరకు ధన్‌బాద్ - అలెప్పి (13351), ఈ నెల 29న హతియా - బెంగళూరు (12835), డిసెంబర్ రెండో తేదీన టాటా - యశ్వంత్‌పూర్ (18111), ఈ నెల 28, డిసెంబర్ మూడో తేదీన జషిది - తాంబరం (12376), డిసెంబర్ ఒకటో తేదీన హతియ - యర్నాకులం (22837) రైళ్లు నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా దారి మళ్లించి నడపనున్నట్లు అధికారులు తెలిపారు.